క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో గురువారం రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు అతిథులుగా హాజరై ఎంపికలను ప్రారంభించారు. ఈ ఎంపికల్లో 10 వెయిట్ కేటగిరిల్లో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో సీనియర్ పురుషులు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ జి.ఎలీషాబాబు మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీలలో పిఠాపురంలో జరిగే సీనియర్స్ రెజ్లింగ్ పోటీలకు 30 మందితో కూడిన జిల్లా జట్టును ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపికల్లో జిల్లా రెజ్లింగ్ సంఘ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, డీఎస్ఏ రెజ్లింగ్ కోచ్ దుర్గ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో పేదలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ తమ వంతు సాయంగా పేదలను ఆదుకునేందుకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు చల్లా విజయలక్ష్మి, రాణి, శ్రీదేవిరెడ్డి, శ్రీవాణి, శైలజ, అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను శుభ్రంగా ఉంచాలి



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు, రాంప్రసాద్

బోట్‌క్లబ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఆలయాన్ని శుభ్రపరచాలని బీజేపీ మీడియా జిల్లా ఇన్‌చార్జి తుమ్మలపల్లి నారాయణరావు అన్నారు. అయోధ్య రాముల వారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం కాకినాడ రూరల్ గంగనాపల్లి గ్రామంలో ఉన్న విజయ గణపతి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈ నెల 22 తారీకు వరకు ప్రతి ఆలయాన్ని శుభ్రం చేయాలని కోరారు. బుల్లితెర హాస్య నటుడు రాంప్రసాద్, బీజేపీ నాయకులు పి.బాబ్జీ, కాళ్ల ధనరాజు, బొలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

కరప: దివంగత ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని గురువారం కరపలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయనకు నివాళులు అర్పించారు. గొర్రిపూడి, వేళంగి గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నేతలు నివాళులు అర్పించారు.

తూరంగిలో..

కాకినాడ సిటీ: తూరంగి పంచాయతీ కార్యాలయం వద్ద, పగడాలపేట వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడిచెట్ల ఫలసాయానికి రేపు బహిరంగ వేలం

కరప: మండలం గొడ్డటిపాలెంలో మండల ప్రాథమిక పాఠశాలలోని మామిడిచెట్ల ఫలసాయానికి శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.అప్పారావు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. పాఠశాల ఆవరణలో 5 మామిడిచెట్లు, ఒక సపోటా చెట్టు ఉన్నాయని, వీటి ఫలసాయం పొందేందుకు గొడ్డటిపాలెం పంచాయతీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు వేలంపాట నిర్వహిస్తారన్నారు. రూ.2 వేలు కనిష్టధరగా నిర్ణయించామని, పాటలో పాల్గొనేవారు రూ.వెయ్యి ప్రధమ ధరావత్తుగా చెల్లించాలన్నారు. పాట పూర్తయిన వెంటనే పాట సొమ్ము పూర్తిగా చెల్లించాలన్నారు.

ఘర్షణలో ఒకరికి కత్తిపోట్లు

కరప: పాతగొడవల నేపథ్యంలో ఇరువురి మధ్య జరిగిన దాడిలో ఒకరు కత్తిపోట్లతో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కరప ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపిన కథనం మేరకు మండలం నడకుదురు గ్రామంలోని జగనన్న జలధార వాటర్‌ప్లాంట్ వెనుక బుధవారం రాత్రి మర్రి గిరీష్‌కుమార్, అతని స్నేహితులు కొల్లు రామ్‌మోహన్, యండమూరు అశోక్ మద్యం తాగారు. వీరు తాగడం చూసిన అదే గ్రామానికి చెందిన వందే రాంబాబు పాత గొడవల నేపథ్యంలో వారి వద్దకు వెళ్లి గిరీష్‌కుమార్‌తో గొడవపడ్డారు. మాటా మాటా పెరిగి గొడవ జరగడంతో రాంబాబు కత్తితో దాడి చేయగా గిరీష్‌కుమార్ కుడికాలు మోకాలు కింది భాగంలో బలమైన గాయమైంది. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా కులగణన

- కమిషనర్ నాగ నరసింహారావు
- విధి విధానాలపై అధికారులకు శిక్షణ

కాకినాడ: కాకినాడలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న కులగణనను పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో కుల గణనపై సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ప్రతి ఇంటికి వెళ్లి వలంటీర్ యాప్‌లో కులాన్ని నమోదు చేయాలన్నారు. సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో లేని కుటుంబ సభ్యుల సౌలభ్యం కోసం ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆయా సచివాలయాలలో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. కులగణన ప్రక్రియకు వలంటీర్‌తో పాటు సచివాలయ కార్యదర్శి కూడా తప్పనిసరిగా ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. కులగణన నమోదు అనంతరం ఫిబ్రవరి 5 నుంచి 15వ తేదీ వరకు పరిశీలన ఉంటుందన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రజల నుంచి సహకరించాల్సిన సమాచారం, విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, పాలనా కార్యదర్శులు, ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు హాజరయ్యారు.



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగ నరసింహారావు

సకాలంలో పూర్తి చేయాలి

కరప: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభించి సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లతో ఏర్పాటు చేసిన కులగణన సర్వే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో 504 మంది వలంటీర్లు, 193 మంది సచివాలయ సిబ్బంది ఎన్యూమరేటర్లు గాను, 21 మంది మండలస్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించినట్టు తెలిపారు. ఈ సర్వేలో ప్రతి వలంటీర్ ఇంటింటికీ వెళ్లి ఆయా ఇంటి యజమానిని కలసి ఫేలిముద్ర తీసుకుని, 14 రకాల ప్రశ్నలు అడిగి సర్వే చేయాలన్నారు. సర్వే ఆధారంగా నమోదు చేసిన కులం ఆధారంగా కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వడంకానీ, ప్రభుత్వ పథకాలు కొత్తగా మంజూరు చేయడం కానీ, ఉన్న పథకాలు తొలగించడం కానీ జరగదని కుటుంబ యజమానులకు తెలియజెప్పాలన్నారు. ఈ నెల 28వ తేదీకల్లా కులగణన సర్వే పూర్తిచేయాలని ఎంపీడీఓ అప్పారావు సూచించారు. కులగణన సర్వేలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, టీఓటీలు జి.దుర్గాభవాని, ఎస్‌కే నాగేంద్రకుమార్, పి.శ్రీనివాస్, ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



కులగణన విధివిధానాలను వివరిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

21 నుంచి శ్రీరామ కల్యాణ పట్టాభిషేకోత్సవాలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అభిషేక కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగాలన్న సత్సంకల్పంతో 21, 22 తేదీలలో స్థానిక ఆనంద భారతి మైదానంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వేద పండితుడు ఎ.మురళీకృష్ణ గురువారం విలేకర్లకు తెలిపారు. కాకినాడ శ్రీరామ భక్త సమాజం, హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష కార్యక్రమాల్లో ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. 21న ఉదయం 6 గంటలకు నగర సంకీర్తన, 8 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర జపం, మధ్యాహ్నం రెండు గంటల నుంచి శ్రీరామ తారక నామ మహా మంత్ర హవనము, సాయంత్రం నాలుగు గంటల నుంచి సకల వాహిని బృందంచే ప్రత్యేక కీర్తనలతో భజన, సాయంత్రం ఐదు గంటలకు శ్రీ సీతారామచంద్రమూర్తి స్వామి వారి దివ్య కళ్యాణం చతుర్వేద స్వస్తి జరుగుతుందన్నారు. అయోధ్య నుంచి వచ్చిన మంత్రాక్షతలను భక్తులకు అందజేయనున్నట్టు వారు వివరించారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర జపము, 9 గంటల నుంచి శ్రీరామ తారక నామ మహామంత్ర హవనము, 11 గంటలకు మహా పూర్ణాహుతి జరుగుతాయన్నారు. 11.30 గంటలకు పట్టాభిషేక మహోత్సవం జరుగుతుందని అనంతరం కళ్యాణ అయోధ్య అక్షింతలు భక్తులకు అందజేయడం జరుగుతుందన్నారు.

కరపలో క్రికెట్ మైదానం అభివృద్ధి



విజేత గురజనాపల్లి జట్టుకు గోల్డ్‌కప్, షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితర నాయకులు



రన్నర్స్‌గా నిలచిన కరప జట్టుకు కప్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు తదితరులు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

కరప: జిల్లాలో గుర్తింపు పొందేలా కరపలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం రాత్రి దేవు సూర్యనారాయణమూర్తి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్, భోగిరెడ్డి వెంకటేశ్వరరావు, పేపకాయల వరప్రసాద్‌ల జ్ఞాపకార్థం నిర్వహించిన నాకౌట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామీణ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 33 సంవత్సరాలుగా ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న సీఏకే అధ్యక్షుడు దేవు మధువీరేష్‌ను ఆయన అభినందించారు. కరప క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు ఆయన మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ, జనసేన, టీడీపీ నాయకులతో కల్సి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఎమ్మెల్సీ చిక్కాల కరపలో మూడు దశాబ్దాలుగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్న సీఏకే అధ్యక్షుడు మధువీరేష్‌ను అభినందించారు. పలువురు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. వివిధ కేటగిరీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. టోర్నీలో పాల్గొన్న అన్ని జట్లకు ప్రోత్సాహక కప్పులను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గరగ జెమ్మీ, వడ్డి మణికుమార్, ఏపీ పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్, వివిధ పార్టీల నాయకులు డాక్టర్ బొండా సూర్యారావు, చిక్కాల దొరబాబు, ముత్తా శశిధర్, తోట బాబు, పంతం సందీప్, రాజారపు రమేష్, శ్రీను, బండారు మురళి, ఎంపీడీఓ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఏకే టోర్నీ విజేత గురజనాపల్లి.. రన్నర్స్‌గా కరప

సీఏకే టోర్నీలో 24జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో గురజనాపలి, కరప జట్లు పోటీ పడ్డాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కరప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 113 పరుగులు చేసి ఆలౌటైంది. తర్వాత చేజింగ్‌కు దిగిన గురజనాపల్లి జట్టు 15.1 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచింది. గురజనాపల్లి జట్టుకు దేవు సూర్యనారాయణమూర్తి (సూరిబాబు) జ్ఞాపకార్థం రూ. 2 లక్షలు విలువ చేసే గోల్డ్‌కప్ రోలింగ్ ట్రోఫీని గెలుచుకుంది. రన్నర్స్ జట్టుకు మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, విన్నర్స్ జట్టు ఎమ్మెల్యే, మాజీమంత్రి కురసాల కన్నబాబు ట్రోఫీలను అందజేశారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి



కరపలో శిక్షణ తరగుతుల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: శిక్షణ పొందిన కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది గ్రామాల అభివృద్ధికి అవసరమయ్యేలా 2024–25 ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో గురువారం గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ అసిస్టెంట్లు, పంచాయతీ ఫ్రంట్‌లైన్ వర్కర్లు, ఫంక్షనల్ సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదరికం లేని గ్రామం, అందరికీ ఆరోగ్యం అనే అంశాలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. సుస్థిరాభివృద్ధికి 17 సూచికలను సాధించేందుకు 9 అంశాల్లో ఆయా గ్రామపంచాయతీకి అవసరమయ్యే ఒక దానిని ఎంపికచేసుకుని, నిధులు సమకూర్చుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తూ, తాగునీటి సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, టీఓటీలు ముమ్మిడి చక్రపాణి, పి.శ్రీనివాస్, జి.దుర్గాభవాని, ఎస్‌కే నాగేంద్రకుమార్, ఎం.నాగేశ్వరరావు, వి.సునీల్‌కుమార్ గ్రామాభివృద్ధి ప్రణాళిక 2024–25 రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి అవగాహన కల్పించారు.

రూరల్ మండల కార్యాలయంలో..

కాకినాడ రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2024– 25పై కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాయల సిబ్బందికి గురువారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ కె.స్వప్న మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఈ ప్రణాళికలు దోహదం చేస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు గోవిందరాజులు, సత్యనారాయణ, బీబీ, రమేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బాట



ఇంద్రపాలెం నుంచి పెదపూడి మండలం వైపు వెళ్లే ప్రధాన రహదారిపై చీడిగ వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్డు

- చీడిగ రహదారులకు మహర్దశ
- రూ.3.35 కోట్లతో పనులు



ఇంద్రపాలెం వంతెన వద్ద రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబు ఆవిష్కరించిన శిలాఫలకం

కాకినాడ రూరల్: నియోజకవర్గంలోని రహదారులకు మహర్దశ పట్టనుంది. కాకినాడ ఇంద్రపాలెం లాకులు నుంచి ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ మీదుగా ఏపీ త్రయం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. గత ఏడాది నవంబరు ఒకటో తేదీన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఈ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాకినాడ–పైన మార్గంలో ఇంద్రపాలెం నుంచి కొవ్వాడ వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర రూరల్ మండలం విస్తరించి ఉంది. సుమారు రూ.3.35 కోట్లతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. చీడిగ వద్ద నాగం కల్యాణ మండపం వద్ద అధిక ట్రాఫిక్ వల్ల రోడ్డుకు పెద్దగా గోతులు ఏర్పడడంతో అక్కడ సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. సంక్షేమ పథకాలే కాదు అభివృద్ధిని కూడా సీఎం జగన్ అందిస్తున్నారని, ఎమ్మెల్యే కన్నబాబు కృషితో మా ప్రాంతంలో రోడ్డు నిర్మిస్తుండడం వల్ల ప్రయాణాలు సులువుగా చేయవచ్చని పేర్కొంటున్నారు. మరో వైపు కాకినాడ నుంచి సామర్లకోట వెళ్లే రహదారి పనులు చాలా వరకు పూర్తికావడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతతో రహదారి నిర్మాణం



కాకినాడ ఇంద్రపాలెం వంతెన వద్ద 15/600 కిలో మీటర్ల నుంచి 22/800 వరకు రూ.3.35 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మిస్తున్నాం. చీడిగ వంటి ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు ప్రతిపాదించాం. రహదారి నిర్మాణం నాణ్యతతో చేపడుతున్నాం.

– లోవరాజు, ఆర్ అండ్‌బీ ఏఈ, కాకినాడ రూరల్

ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు



కాకినాడ నుంచి పెదపూడి మండలం రామేశ్వరం తదితర గ్రామాల్లో చీడిగ మీదుగా రాకపోకలు సాగించే ప్రధాన రహదారి నిర్మించడం అభినందనీయం. రోడ్డుపై గుంతల వల్ల దుమ్ము బయటకు వచ్చేది. కొత్తగా రోడ్డు నిర్మాణంతో ఆ సమస్య తీరనుంది. ఈ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు.

– కొప్పిశెట్టి గణేష్, చీడిగ

వినికిడి సమస్య లేని జిల్లాగా కాకినాడ

- పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ
- పలు సంస్థలు అందించిన వినికిడి యంత్రాల పంపిణీ



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ

బోట్‌క్లబ్: జిల్లాను వినికిడి సమస్యలేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని శ్రీ పీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆ సంస్థల ఆధ్వర్యంలో గురువారం వినికిడి సమస్యలతో బాధపడుతున్న 150 మంది పేదలకు రూ.30 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ తోట సర్వారాయుడు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు 250 మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు మాట్లాడుతూ ఇప్పటివరకు 10 వేల వినికిడి యంత్రాలను ఉచితంగా, ఐదు వేల యంత్రాలను 50 శాతం ధరలకు అందించినట్టు తెలిపారు. కాకినాడ ఉమా మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి వినికిడి సమస్య లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్లు చెక్కా రమేష్, అనపర్తి వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటర్ల సవరణకు 1.13 లక్షల దరఖాస్తులు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

- ఈఆర్వో నాగనరసింహారావు
- రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

కాకినాడ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే –2024కు సంబంధించి ఫారం–6, 7, 8 ద్వారా ఇప్పటి వరకు 1,13,504 దరఖాస్తులు అందాయని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కాకినాడ సిటీ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. గురువారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. సవరణ ప్రక్రియ ప్రగతిని ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు లక్షా 436 దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామన్నారు. 12,023 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఇంకా సుమారు వెయ్యి దరఖాస్తులు పరిష్కరించాలని చెప్పారు. నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు నూతన దరఖాస్తులను కూడా స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కమిషనర్ నివృత్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు జాన్‌బాబు, వరహాలయ్య, మురళి, సీతాపతిరావు, హరిదాసు, నాగశాస్త్రులు తదితరులు పాల్గొన్నారు.

25న ఓటర్ల దినోత్సవం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు నియోజకవర్గ ఈఆర్వో, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసిహారావు చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఈ అంశంపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, వివిధ వర్గాల ప్రతినిధులతో ఆయన గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. ఓటు విలువను ప్రజలకు తెలియజెప్పడం, ఓటు హక్కును వినియోగించుకోవడం వంటి అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతపై వ్యాసరచన, వక్తృత్వ, షార్ట్‌ఫిల్మ్ పోటీలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 25వ తేదీన వివేకానంద పార్కు నుంచి పీఆర్ కళాశాల వరకు ఓటర్ వాక్ నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం పీఆర్ కళాశాలలో జరిగే జాతీయ ఓటరు దినోత్సవంలో వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. సీనియర్ ఓటర్లను సన్మానించడం, యువ ఓటర్లు, కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఏఈ ఆర్వోలు సీతాపతిరావు, వరహాలయ్య, హరిదాసు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, యూనివర్సిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.అబ్బయ్య పాల్గొన్నారు.

బాలుడి హత్యకేసులో ఇద్దరికి జైలు శిక్ష

రాజమహేంద్రవరం రూరల్: బాలుడి హత్య, తప్పుడు సాక్ష్యాలు ఇచ్చిన కేసులో ఇద్దరికి రాజమహేంద్రవరం రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.పద్మ జైలుశిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన లక్ష్మికి మల్లెమొగ్గల శివతో వివాహం కాగా, వీరికి ఆరేళ్ల కుమారుడు మంజునాథ ఉన్నాడు. మనస్పర్థల వల్ల వారు విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మికి సామర్లకోటకు చెందిన దోనం దాసు ఎలియాస్ ఆకాష్‌తో పరిచయమైంది. దీంతో లక్ష్మి, తన కుమారుడు మంజునాథను తీసుకుని దాసుతో కలిసి 2021 మార్చిలో రాజమహేంద్రవరం సీతంపేటకు వచ్చింది. ఇంటి యజమాని, చుట్టుపక్కల వారికి తాము భార్యాభర్తలమని వారు నమ్మించారు. అదే సంవత్సరం జూలై 27న మంజునాథను టేబుల్ బుక్ చదవమని దాసు చెప్పాడు. అయితే బాలుడు చదవకపోవడంతో కోపంతో దవడలపైనా, తలపైనా గట్టిగా కొట్టాడు. దీంతో మంజునాథ అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. బాలుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లిన లక్ష్మి, దోనదాసులు బాలుడు మంచంపై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయని చెప్పారు. వారిద్దరిపై అప్పటి త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో దోనదాసుకు ఐదేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, (సాక్ష్యాలను తారుమారు చేసినందుకు) మూడేళ్లు సాధారణ జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా, కట్టని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. మల్లెమొగ్గల లక్ష్మికి (సాక్ష్యాలను తారుమారు చేసినందుకు) మూడేళ్లు సాధారణ జైలు, రూ.2 వేల జరిమానా, కట్టని పక్షంలో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణ వాదించారు. త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎన్.వెంకటేశ్వరరావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పి వీరయ్యగౌడ్ కోర్టులో ట్రయల్ పర్యవేక్షించారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) MAHINDRA 575 YUVO 45HP 4WD 2020 MODEL AP39 FB 0797
2) VST SHAKTI MT 270 VIRAAT PLUS HIGH TORQUE 2021 MODEL AP39 KD 3276
3) ESCORTS PT EURO 42 PLUS 44 HP 2021 MODEL AP39 TU 5548
4) ESCORTS PT EURO 42 PLUS 44 HP 2021 MODEL AP39 HZ 1645
5) AGLUX 50 DC PS 8+2 FCM NRA BATT 75 AH 4WD 2021 MODEL AP39 TY 1758
Cell : 77806 27429
13-1-33/2, 2nd Floor, Sri Sai Sannidi Complex, Opp. Town Hall, Main Road, KAKINADA.